క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట: మండలంలోని వెల్జిపూర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎడ్ల బాలయ్యకు రూ.60వేలు, దేశెట్టి అనూషకు రూ.38 వేలు, ఓరెం భాగ్యలక్ష్మికి రూ.26వేలు, ఓరెం అనిల్‌కు రూ.40,500, సోమిరెడ్డి భాగ్యరెడ్డికి రూ.20వేలు, వంగపల్లి వంశీకి రూ.48 వేలు, బొల్లం పోచయ్యకు రూ.34 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్ల కోమటి వీరేశం పంపిణీ చేశాడు. ఇక్కడ మాజీ సర్పంచ్ గుండ వెంకటేశం, ఏఎంసీ డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి, బొల్లారం పరుశరాములు, బొజ్జ శ్రీనివాస్, మూల బాల్ రెడ్డి, తదితరులున్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలకేంద్రంలోని పురాతన శైవక్షేత్రం త్రికూటాలయంలో గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, మాజీ సర్పంచ్ అంకారపు అనిత, సింగిల్‌విండో వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, అంకారపు రవీందర్, పడిగెల రాజు, కందుకూరి రామాగౌడ్, రాపెల్లి ఆనందం, లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- మూడు రోజుల క్రితం ప్రమాదం
- పోతిరెడ్డిపల్లిలో విషాదం



అమృత (ఫైల్)

ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన అంబటి రాజేందర్, అమృత (53) దంపతులు మూడు రోజుల క్రితం శివరాత్రి పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు తమ కారులో వెంకటాపూర్ వెళ్లారు. అదే సమయంలో వారి కూతురు నిజామాబాద్ నుంచి వస్తున్నట్లు ఫోన్ చేసి తెలిపింది. తాను కూతురును తీసుకొని వస్తానని చెప్పిన రాజేందర్ భార్య అమృతను గ్రామానికి చెందిన ఒకరి బైక్‌పై ఇంటికి పంపించాడు. మార్గమధ్యలో అమృత చీర బైక్ వెనుక చక్రంలో ఇరుక్కోవడంతో కిందపడిపోయింది. తీవ్రంగా గాయపడ్డ వివాహితను మొదట సిరిసిల్ల, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు చనిపోయింది. కాగా మృతురాలికి ముగ్గురు కూతుళ్లు. ఒక కుమార్తె అమెరికాలో స్థిరపడింది. ఆమె గురువారం చేరుకోవడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

తంగళ్లపల్లి: ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామానికి చెందిన ఆరె లక్ష్మీనర్సయ్య (54) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొన్ని రోజులక్రితం విద్యుత్‌షాక్‌కు గురికాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గురువారం మృతిచెందాడు. మృతుడికి కుమారుడు నవీన్, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవంలో ప్రమాదం



వేములవాడ: వేములవాడ రాజన్న మహా జాతర సందర్భంగా గుడిచెరువు ఖాళీ స్థలంలో రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారులను రప్పించి ఉత్సవాలు జరిపించారు. బుధవారం అర్ధరాత్రి వరకు జరిగిన ఉత్సవాల్లో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన కళాకారులు సాహస నృత్యం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తలకు నిప్పంటుకుంది. దీన్ని గమనించిన సహచర కళాకారులు వెంటనే తేరుకుని వెంటనే మంటలార్పేశారు. అలాగే మరో నృత్యంలో నోట్లో కిరోసిన్ పోసుకుని నృత్యం చేస్తూ ఫైర్‌ను గాలిలో ఊదే క్రమంలో సదరు కళాకారుడి ముఖానికి మంటలు తగిలినట్లు కళాకారులు తెలిపారు.

డబ్బులిస్తామని ఆశచూపారు.!

వీర్నపల్లి: మండలంలోని జవహర్‌లాల్‌నాయక్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరికి ఎమెల్సీ ఎన్నికల్లో డబ్బులు పంచి కొందరికి ఇవ్వలేదని పలువురు వాపోయారు. బుధవారం రాత్రి కొందరు నాయకులు తండాలోని సగం మంది ఓటర్లకు రూ.వెయ్యి చొప్పున పంచారని, మిగతావాళ్లకు గురువారం ఉదయం ఇస్తామని ఆశచూపి ఇవ్వలేదని జవహర్‌లాల్ నాయక్‌కు చెందిన భూక్య కిషన్, విజయ, నూనవత్ రజిత, సరిత, కల్యాణి తెలిపారు.



కోనరావుపేట: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న మహిళా ఓటర్లు



వేములవాడఅర్బన్: వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో..



ఎల్లారెడ్డిపేటలో ఓటుహక్కు వినియోగించుకున్న కృష్ణారెడ్డి దంపతులు

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్

వేములవాడఅర్బన్/వేములవాడ రూరల్/తంగళ్లపల్లి/చందుర్తి/కోనరావుపేట/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సజావుగా జరిగింది. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు ఓటర్లు ఉదయాన్నే బారులుతీరారు. వేములవాడ రూరల్ మండలంలో 72 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సరళిని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే.మహేందర్ తన ఎమ్మెల్సీ ఓటును ముస్తాబాద్ మండలకేంద్రంలో, సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చందుర్తి మండలంలో పట్టభద్రుల పోలింగ్ 73.49 శాతం పోలయ్యాయి. కోనరావుపేట మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 1496 మంది ఉండగా 1010 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. టీచర్స్‌లో 35 ఓట్లు ఉండగా 34 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగ య్య కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి దంపతులు, పలువురు పట్టభద్రులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికల సరళిని కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పరిశీలించారు. గంభీరావుపేట డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు, టీచర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. బోయినపల్లి మండలకేంద్రంలోని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. టీచర్లలో 46 మందికి 40 మంది, పట్టభద్రుల ఓటర్లు 1807 మందికి 1255 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. బోయినపల్లి పోలింగ్ కేంద్రంలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ సతీమణితో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోనరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలకేంద్రాల్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటింగ్ సరళిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వేములవాడ పట్టణంలో పోలింగ్ కేంద్రాన్ని అఖిల్‌మహాజన్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పరిశీలించారు. బోయినపల్లి, ఇల్లంతకుంటలో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు.



తంగళ్లపల్లిలో బారులుతీరిన ఓటర్లు



ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేటలో ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



చందుర్తిలో క్యూలైన్‌లో నిల్చున్న పట్టభద్రులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సిరిసిల్ల టౌన్: శివనగర్‌లో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



చందుర్తి : పూజలు చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్



ఎల్లారెడ్డిపేట : ఆలయంలో భక్తుల పూజలు



బోయినపల్లి: శివకల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో శ్రీ రాజరాజేశ్వరుల కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. శివనగర్‌లో రెండ్రోజులపాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు కల్యాణోత్సవంతో ముగిశాయి. నిత్యపూజలు, రుద్రహోమం, పూర్ణాహుతి, రాజ రాజేశ్వరుల కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు సురేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ, విశ్వనాథ ఆలయాల్లో..

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ ఆలయం, విశ్వనాథ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతిరావు, ఏఈవో రవీందర్, పట్టణ ప్రముఖులు అర్చక స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : ఎన్గల్ శివాలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలను భక్తులు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మహోత్సవంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నియోజకవర్గ ఇన్‌చార్జిలు చల్మెడ లక్ష్మీనర్సింహరావు, చెన్నమనేని వికాస్‌రావు–దీప దంపతులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామ ప్రముఖులు వారి స్వామివారి కండువాలతో ఘనంగా సన్మానించారు. వారి వెంట ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేట మండలం నాగంపేటలోని శ్రీ భక్తమార్కండేయ షిరిడీ సాయిబాబా ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. అభిషేకం, అలంకరణ, శాంతిపఠం, స్వస్తి వారనం, ప్రధాన కలశ స్థాపన, అగ్నిప్రతిష్ట, కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బోయినపల్లి: విలాసాగర్ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి, బోయినపల్లి శివాలయం, వెంకట్రావుపల్లి శ్రీ రామేశ్వర ఆలయాల్లో శివకల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.ఆయా ఆలయాల భక్తబృందం తదితరులున్నార.

ఎండలో నిలబడేదెలా ?

- మరిమడ్లలో ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికుల ఇబ్బందులు



దుకాణాల ముందు కూర్చున్న ప్రయాణికులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూర్చునేందుకు కూడా స్థలం లేకపోవడంతో ఎండలో అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ప్రయాణప్రాంగణం బస్టాండ్‌కు దూరంగా ఉండడంతో వినియోగంలో లేకుండాపోయింది.

అటవీ గ్రామాలకు కేంద్రం మరిమడ్ల

కోనరావుపేట మండలంలోని మరిమడ్ల చుట్టుపక్కల అన్ని గ్రామాలకు కేంద్రంగా ఉంటుంది. మండలంలోని మరిమడ్ల మీదుగా గర్జనపల్లి, నిజామాబాద్ జిల్లా సిరికొండ, మానాల, సిరిసిల్ల, కోనరావుపేట ప్రాంతాలకు రోజూ వాహనాలు, ప్రయాణికులు వెళ్తుంటారు. వీరందరికీ మరిమడ్ల కేంద్రంగా ఉంది. వీటితో పాటు శనివారం జరిగే వారసంతకు అహ్మద్‌హుస్సేన్‌పల్లి, తాటిపెల్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు.

శిథిలమైన రేకులషెడ్డు

మరిమడ్లలో బస్టాండ్ ప్రాంతంలో గతంలో రేకుల షెడ్డు ఉండేది. ప్రయాణ ప్రాంగణం ఊరికి దూరంగా ఉండడంతో అక్కడ బస్సులు కూడా వెళ్లవు. రేకుల షెడ్డులో ఉన్న ప్రయాణ ప్రాంగణాన్ని గత కొన్నేళ్ల క్రితం కూల్చివేశారు. మళ్లీ నిర్మించకపోవడంతో తాత్కాలికంగా పందిరివేశారు. దీంతో ప్రయాణికులు దుకాణాల గద్దెలవద్ద కూర్చుంటున్నారు. వేసవి, వానాకాలం ఇబ్బందులు పడుతున్నారు.

బస్టాండ్‌లోనే నిర్మించాలి



మరిమడ్ల గ్రామంలో ప్రయాణ ప్రాంగణంలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదివరకు ఏకలవ్య పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్నా అక్కడికి బస్సులు రావు. బస్టాండ్ నిరుపయోగంగా మారింది. ఊరిలో ఉన్న స్థూపం కూడలి వద్ద బస్సులు ఆగుతాయి. ప్రయాణ ప్రాంగణాన్ని బస్టాండ్ ప్రాంతంలోనే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – శ్రీనివాస్, మరిమడ్ల

పోలింగ్ కేంద్రానికి తాళం..

- సమయం దాటడంతో అనుమతించని పోలీసులు
- వెనుదిరిగిన ఓటర్లు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సమయం నాలుగు గంటలు దాటి ఓటర్లు రావడంతో పోలీసులు లోపలికి అనుమతించలేదు. పోలింగ్ కేంద్రం ప్రధాన ద్వారానికి పోలీసులు తాళం వేశారు. కొంతమంది ఓటర్లు హైదరాబాద్ నుంచి రావడానికి ఆలస్యం జరిగిందని, లోనికి అనుమతించాలని పోలీసులను కోరినప్పటికీ వారు నిరాకరించారు. పోలింగ్ అధికారులతో సంప్రదించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. ఉదయం 8గంటలకు ప్రాంభమైన ఓటింగ్ సాయంత్రం 4గంటలకు ముగియడంతో గేటుకు పోలీసులు తాళం వేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన వారితో పాటు మరికొందరు సమయం దాటిపోవడంతో ఓటు వేయకుండా నిరాశతో వెనుదిరిగారు.

రోడ్డు పక్కనే సంత..

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్‌లో రహదారి పక్కనే సంత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో ప్రతి మంగళవారం సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారి పక్కనే అంగడి నిర్వహిస్తున్నారు. సంతకు వచ్చే ప్రజలతో రోడ్డుపూర్తిగా జనంతో నిండిపోతుంది. దీంతో ప్రధాన రహదారిపై వాహనాలు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారుతోంది. పలుసార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. సంతను వేరే చోటుకు మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో మురుగుకాలువలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామం నుంచి బోనాలకు వెళ్లేదారిలో ఉన్న మురుగుకాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో సైడ్‌కు కట్టిన బండరాళ్లు కూడా కూలిపోతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి మురుగుకాలువకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : మహ్మద్ మొయిజ్
పంచాయతీ సెక్రటరీ సెల్ నెంబర్: 8978605171

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

డబుల్ రోడ్డుకు మోక్షం

- కోరెం నుంచి నల్లగొండ వరకు డబుల్ రోడ్డు
- రూ.6 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభం
- తీరనున్న వాహనదారుల కష్టాలు



అధ్వానంగా అనంతపల్లి- నల్లగొండ రోడ్డు (ఫైల్)

బోయినపల్లి: మండలంలోని కోరెం గ్రామం నుంచి జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం లభించింది. ఈ రోడ్డు అభివృద్ధి చేయాలని ఎన్నో ఏళ్లగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కోరెం నుంచి వయా అనంతపల్లి మీదుగా నల్లగొండ వరకు ఆరు కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి గ్రామీణ రోడ్ల అభివృద్ధి (సీఆర్‌ఆర్) గ్రాంట్ కింద రూ.6 కోట్లు నిధులు మంజూరుకాగా డబుల్ రోడ్డు పనులు ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఈ రోడ్డు అధ్వానంగా మారగా కోరెం, అనంతపల్లి మీదుగా నల్లగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడ్డారు. మొదటి దశలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా ఇప్పుడు మీటర్ దయాతో 8 బ్రిడ్జిల నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

పాత రోడ్డుకు ఇరువైపులా రోడ్డు విస్తరణ

బోయినపల్లి నుంచి బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి, గ్రామాల మీదుగా నల్లగొండ వరకు రెండేళ్ల క్రితం 3.75 మీటర్ల వెడల్పుతో సింగిల్‌లేన్ బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. నిధులు సరిపోకపోవడంతో అనంతపల్లి చివరివరకు బీటీరోడ్డు పనులు చేసి వదిలేశారు. అనంతపల్లి చివరివరకు గతంలో ఉన్న పాత బీటీరోడ్డుకిరువైపులా 1.07 మీటర్ల మేర రోడ్డు విస్తరణ చేపట్టి మొత్తం 7 మీటర్ల మేర డబుల్ రోడ్డుగా మార్చాలని ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారు. గతంలో నిధులు సరిపోక అనంతపల్లి నుంచి నల్లగొండ వరకు 2 కిలోమీటర్ల మేర కొత్త బీటీతో డబుల్ రోడ్డు వేయనున్నట్లు పీఆర్ ఏఈ తెలిపారు. డబుల్ రోడ్డు నిర్మాణంలో కోరెం ప్రారంభం నుంచి గ్రామం చివరివరకు రోడ్డుకు దగ్గరగా ఇళ్లు ఉన్నాయి.

రవాణా మెరుగు

కోరెం నుంచి నల్లగొండ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తే మండలంలోని బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి, తడగొండ, మల్కాపూర్, గుండన్నపల్లి గ్రామాల ప్రజలకు, ప్రయాణికులకు, వివిధ వ్యాపార వర్గాల వారికి రవాణా సదుపాయం మెరుగవుతుంది. అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాలను ఆనుకునే కొడిమ్యాల మండలం ఉంటుంది. అక్కడి నుంచి ఎక్కువగా మండలానికి రాకపోకలు సాగుతాయి.

బోయినపల్లి రోడ్డు వేయాలి

మండలకేంద్రం నుంచి కోరెం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర మాత్రమే దూరం ఉంటుంది. ఈ క్రమంలో బోయినపల్లి నుంచి బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి గ్రామాల మీదుగా నల్లగొండ వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రవాణా మెరుగు



కోరెం నుంచి నల్లగొండ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విజ్ఞప్తి చేయగా నిధులు మంజూరుచేయించారు. డబుల్ రోడ్డు నిర్మాణంతో మండలం నుంచి జగిత్యాల జిల్లాకు రవాణా సదుపాయం పెరుగుతుంది.
– వన్నెల రమణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

బోయినపల్లి వరకు వేయాలి



కోరెం నుంచి బోయినపల్లి వరకు మూడు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. బోయినపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడితే మండలకేంద్రం నుంచి జగిత్యాల జిల్లా వరకు రవాణా సదుపాయం అనుకూలంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ప్రయత్నించాలి.
– అలువాల అజయ్, బోయినపల్లి

బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి



కోరెంనుంచి నల్లగొండ వరకు రూ.6 కోట్ల అంచనాలతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాం. 8 చోట్ల బ్రిడ్జి నిర్మాణాల పనులు జరుగుతున్నాయి. కోరెం, అనంతపల్లిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించాం. అనంతపల్లి – నల్లగొండ వరకు 2 కిలోమీటర్ల మేర కొత్త బీటీ వేయడం జరుగుతుంది.
– విష్ణువర్ధన్, పీఆర్, ఏఈ,